క్లుప్తంగా

ఘనంగా వంగవీటి రంగా జయంతి


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చినగంజాం (పర్చూరు): వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. పర్చూరు బొమ్మల సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వంగవీటి మోహన్‌రంగా అంటూ నినాదాలు చేశారు. విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో అభిమానులు పెదపూడి విజయ్ కుమార్, కఠారి సురేంద్ర, ఒగ్గిశెట్టి నరసింహారావు, మాధవరావు, షేక్ గౌస్, తేజ, అగ్నిగుండాల వెంకట కృష్ణ, కాయల శ్రీను, రంగిశెట్టి రవి, తులసి శ్రీను, తులసి అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈవోఆర్డీ మురళీ బాపూజీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా సమస్యలను లేకుండా చేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో చేయాల్సిన పనులకు అన్నీ అనుమతులు తీసుకుని త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయాల సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

రేపు పెంపుడు శునకాలకు వ్యాక్సిన్

చీరాల అర్బన్: ప్రపంచ జూనోసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌లు శనివారం వేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.చిట్టిబాబు గురువారం తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు స్థానిక వైకుంఠపురంలోని పశువైద్యశాలలో వ్యాక్సిన్‌లు వేయనున్నట్లు తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు రాబిస్, ఆంత్రాక్స్, క్షయ, బ్రూసెల్లోసిస్, ఏవీఎస్ ఇన్‌ఫ్లూయెంజా మొదలైన వ్యాధులు సంక్రమిస్తాయని, ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని ప్రజలు తమ పెంపుడు శునకాలను తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వ్యాక్సిన్ డోసులు ఆధారంగా మరికొద్ది రోజుల వరకు కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

'అల్లూరి'కి ఘన నివాళి


అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల అర్బన్: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన భారతీయ విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ నిరాకరణ ఉద్యమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలన పట్ల అసంతృప్తి పెరగడంతో బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేశారన్నారు. ఆదివాసీలు, ఇతర సానుభూతిపరుల సంయుక్త దళాలను సమీకరించి బ్రిటిష్ పాలకులపై పోరాటాలు చేశారన్నారు. స్థానిక ప్రజలు మన్యం వీరుడు అనే బిరుదు ఇచ్చారన్నారు. 1986లో అల్లూరి సీతారామరాజు స్మారక స్టాంపును ఇండియా పోస్టు విడుదల చేసిందన్నారు. ఆయన ప్రాణత్యాగానికి గుర్తుగా ఆయన జయంతిని ఏటా రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

అద్దంకి రూరల్: డయేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ కృష్ణకుమారి అన్నారు. గురువారం అద్దంకిలోని నంబూరివారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో బాలింతలు, గర్భిణులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాల పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం


శింగరకొండ దేవస్థానం వ్యూ (ఫైల్)


శింగరకొండ వద్ద వంపు తిరిగిన నామ్ రహదారి

శింగరకొండకు గ్రహణం వీడేనా ?

- పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు అనుకూల ప్రదేశం
- నాలుగు జిల్లాలు, రెండు రాష్ట్రాలను కలిపే నామ్ రహదారి
- 600 ఎకరాల భవనాశి చెరువు
- చోద్యం చూస్తున్న అధికారులు


శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానం

అద్దంకి రూరల్:

దేవదాయశాఖ పరిధిలో ఆలయాలకు ఆదాయం మాత్రం ఘనం. కాని వాటి పరిధిలో ఉండే ఆలయాలను అభివృద్ధి చేయడంలో మాత్రం నిర్లక్ష్యం. అంతేకాదు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే యావ అటు అధికారులకు, పాలకులకు లేకపోవడం దురదృష్టకరం. ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ దేవస్థానం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. చుట్టూ 600 ఎకరాల మేర భవనాశి చెరువు, 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, నాలుగు జిల్లాలు, రోడ్డు రాష్ట్రాలను కలిపే నామ్ రహదారి ఉన్న ఈ పుణ్యక్షేత్రం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అన్ని అర్హతలు కలిగి ఉంది. కాని ఆచరణకు ఏమాత్రం నోచుకోవడం లేదు.

పర్యాటకంగా శింగరకొండ అనుకూల ప్రదేశం..

శింగరకొండ అద్దంకికి అనుసంధానంగా అతి దగ్గరలో ఉంది. నార్కెట్‌పల్లి–మేదరమెట్ల రహదారి పైన విరాజిల్లుతోంది. ఇక్కడ ఉన్న 99 అడుగుల ఎత్తైన ఆంజనేయ విగ్రహం దేశంలోనే రెండోదిగా చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. కొండపై క్షేత్ర పాలకుడైన లక్ష్మీ నరసింహస్వామి కొలువై ఉన్నాడు. కొండపై నుంచి చూస్తే భవనాశి చెరువుతోపాటు, వంపులు తిరిగి నామ్ రహదారి వంటి ఆహ్లాదకరమైన దృశ్యాలు కనబడతాయి. అక్కడ నిలబడి ఫోటోలు దిగని భక్తులు లేరు. పర్యాటక కేంద్రంగా శింగరకొండ అభివృద్ధి గతంలో బీజం పడినప్పటికి కార్యరూపం దాల్చలేదు.

నాలుగు జిల్లాలు కలిపే నామ్‌రహదారి..

ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలను కలిపే మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారి వెంబటే ఉండటం రవాణా వసతికి పూర్తి అనుకూలం. ప్రతి సంవత్సరం జరిగే వార్షిక తిరునాళ్లకు ఆయా జిల్లాల నుంచేకాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తుంటారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు అంచనాలతో సరి..

శింగరకొండ వంటి ఆధ్యాత్మిక ప్రాంతాన్ని, పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు అంచనాలు తయారు చేయటంతోనే సరిపెడుతున్నారు. వచ్చిన కొత్త ప్రభుత్వం అయిన పట్టించుకుని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలని భక్తులు, ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈవిషయమై శింగరకొండ ఏసీ సుభద్రను వివరణ అడగగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంలో మాపరిధిలోకి రాదు. మా శాఖ పరిధిలో ఉన్నంత వరకు మేము అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఆహ్లాదకరంగా భవనాశి చెరువు..


భవనాశి చెరువు (ఫైల్)

ఈ క్షేత్రానికి సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో భవనాశి చెరువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చెరువును అభివృద్ధి చేసి మధ్యలో హైద్రాబాద్‌లోని ట్యాంకు బండ్‌లోని బుద్ధ విగ్రహం మాదిరి ఏర్పాటు చేసి బోటు షికారు రిసార్ట్స్ వంటివి ఏర్పాటు చేయాలని 2009 నాటి ప్రభుత్వంలో పర్యాటక శాఖ తలంచింది అప్పట్లో అభివృద్ధి చేసేందుకు రూ. 2 కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. ఇంకా భక్తులను, పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాట్లు చేస్తే మంచి పర్యాటక కేందంగా అవకాశం ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేనివి


చీరాలలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అతిథులు


కారంచేడులో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

- ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు

చీరాల అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశభక్తుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి యువత అలవర్చుకోవాలన్నారు. విప్లవ బాటలో నడిచి బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. ఆయన జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సర్విశెట్టి సుబ్బరామయ్య, రిటైర్డు బ్యాంకు ఉద్యోగి జి.హరిప్రసాద్, రైల్వేఅభివృద్ధి కమిటి మెంబర్ తడవర్తి చంద్రశేఖర్, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: మన్యం విప్లవ వీరుడిగా పేరుగడించిన అల్లూరి సీతారామరాజుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బీ బాబూరావు మాట్లాడుతూ మన్యం వీరుడు దేశానికి, రాష్టానికి అందించిన అనేక సేవా కార్యక్రమాలు, తిరుగుబాటు కార్యక్రమాలు ప్రజలకు మాదిరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ పీ లక్ష్మీనారాయణ, సిబ్బంది, పాల్గొన్నారు.

బల్లికురవ: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజని తహశీల్దార్ ఎం సుభద్ర అన్నారు. గురువారం కార్యాలయంలో అల్లూరి 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ రవికుమార్ రీసర్వే టీడీ ప్రహర్ష, వీఆర్‌వోలు పాల్గొన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ అల్లూరి సీతారామరాజు వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం అనిల్ కుమార్ కోరారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి పీ. రవీంద్రబాబు అధ్యాపకుడు అల్లూరి సేవలను కొనియాడారు.

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజుగారిపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజు, అచ్చిరాజు, రోటరీ క్లబ్ ప్రతినిధులు మాదాల సాంబశివరావు గరిమిడి శ్రీనివాసరావు కొర్రపాటి ఖాజారావు, రావి అంకమ్మ చౌదరి గ్రామస్తులు అల్లూరికి నివాళులర్పించారు.

అద్దంకి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.


బల్లికురవలో అల్లూరికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్


అద్దంకిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది


రాజుగారిపాలెంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

క్రమశిక్షణతో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్


విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

జే.పంగులూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యతో పాటు, క్రమశిక్షణ, సేవా భావం వంటి వాటిపై దృష్టి సారించాలని చీరాల డిప్యూటీ డీఈవో ఎం నిర్మల సూచించారు. మండంలోని కొండమూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ డీఈవో నిర్మల పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్‌తో ఉన్న కిట్‌లను విద్యార్థులకు గురువారం అందజేశారు. ఈసందర్భంగా నిర్మల మాట్లాడుతూ సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి భాష పదాలు నేర్పించడం ద్వారా భాషాజ్ఞానం పెంపొందించాలన్నారు. రోజువారి పాఠ్యాంశాల బోధనా క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు చేరిన విద్యా కిట్లను సమగ్రశిక్ష సీఈవో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మండలంలోని 6 ఉన్నత, 7 ప్రాథమికోన్నత, 31 ప్రాథమిక పాఠశాలల్లోని 3511 మంది బాలబాలికలకు విద్యా కట్‌లను అందజేస్తారని ఎంఈఓలు నాగభూషణం, వీరాంజినేయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ చౌదరి, కో ఆర్డినేటర్ హరిబాబు , సీఆర్‌పీలు సురేష్, మోషే, శ్యామల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ద్రావణం ఎంతో శక్తినిస్తుంది


ఓఆర్ఎస్ పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): వాంతులు, విరేచనాలు సమయంలో మీ బిడ్డలు ఎంతో నీరసించిపోతారని అలాంటి సమయంలో తల్లులు, బిడ్డలకు ఓఆర్ఎస్ ద్రావణంను పట్టించాలని స్వర్ణ పీహెచ్‌సీ డాక్టర్ హస్మప్రియ అన్నారు. గురువారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని స్వర్ణ, కొడవలివారి పాలెం గ్రామాల్లో పర్యటించి అతిసార వ్యాధులు ప్రబలే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా శిశువులు (2–6 నెలల వయస్సు) చిన్న పిల్లలు (6 నెలల పైబడిన వయస్సు) వారికి ఓఆర్ఎస్‌లతో పాటు జింక్ మాత్రలను కనీసం 14 రోజుల పాటు వాడాలన్నారు. అతిసార సమయంలో ప్రతి ఒక్కరు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మల, మూత్ర విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పకుండా చేతలను సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆశాలు, ఏఎన్ఎంల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ప్యాకెట్లను ఎలా కలుపుకోవాలో ఆమె వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిశరాల పరిశుభ్రతను కూడా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరరావు, ఎల్‌టీ బయ్యా శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు బిడ్డల తల్లులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళులు


రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వస్త్ర వ్యాపారులు

చీరాల అర్బన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి ఎనలేని సేవలు చేశారని.. వారు అభినందనీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 91వ జయంతి సందర్భంగా గురువారం ఎంజీసీ మార్కెట్‌లో ఉన్న కొణిజేటి రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహోన్నత వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, ఎంజీసీ, టీటీఎంఏ ప్రతినిధులు, వస్త్రవ్యాపారులు ఉన్నారు.

వర్షం కోసం ఎదురు చూపులు

బల్లికురవ: జేష్ఠ మాసం ముగుస్తున్నా వరుణుడు కరుణించపోవటంతో మండలంలోని రైతులు ఆకాశం వైపు ఎదురుచూడక తప్పడం లేదు. మెట్ట, మాగాణి భూములో ఖరీఫ్ ఆరంభ పైర్లు సాగుచేసేందుకు దుక్కులు దున్ని విత్తనాలను కూడా సమకూర్చుకున్నారు. గత రెండు నెలలుగా చిరుజల్లుల మినహా భూములు పదును కైవర్షం కురవలేదు. ఈ పరిస్థితులకు తోడు చిరుజల్లుల ప్రభావానికి ఎండలు, వడగాల్పుల ప్రభావం పెరిగింది. వరుణుడి కరుణ కోసం గ్రామాల వారీగా గ్రామ దేవతలకు మొక్కుతో పూజలు నిర్వహించారు.

అకడమిక్ క్యాలెండర్ నిర్వహణ తప్పనిసరి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సుధాకర్

అద్దంకి: ఉపాధ్యాయులు అకడమిక్ క్యాలెండర్‌ను కచ్చితంగా నిర్వహించాలని ఎంఈవో టూ బీ సుధాకర్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని పలు ప్రాథమికా పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్‌ను, వసతుల పరంగా జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ డయేరియాపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలనన్నారు. డయేరియా ఎలా వస్తుందో పిల్లలకు తెలియజేశారు. చేతుల పరిశుభ్రతతోనే వ్యాధుల్లో చాలా వ్యాధులకు దరి చేరకుండా చూడవచ్చని చెప్పారు. ప్రతి విద్యార్థి చేతుల శుభ్రత గురించి తమతోపాటు ఇంట్లోని పెద్దలకు తెలియజేయాలని చూసించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, ఆరుద్ర నక్షత్రం, అమావాస్య తిథి సందర్భంగా శుక్రరారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com